

నేటి నుంచి మారెమ్మ ఉత్సవాలు

జీకేవీధి మండలం సీలేరు గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 16న గరగ అలంకరణ, అగ్నిగుండం, 27న పురవీధుల్లో ఊరేగింపు, 28న అమ్మవారి ప్రధాన పండగ నిర్వహిస్తారు. మే ఒకటిన మరుపూజతో ఉత్సవాలు ముగుస్తాయి.

- వివరాలు 8లో




నేడు చంద్రబాబు ప్రజాగళం

- మధ్యాహ్నం 2.30 గంటలకు పాయకరావుపేటలో... సాయంత్రం 5.35 గంటలకు గాజువాకలో సభలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత తదితరులు



విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని పాయకరావుపేట, గాజువాకల్లో ప్రజాగళం సభల్లో పాల్గొంటారు. ఆయన మధ్యాహ్నం 12.55 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 2.05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్ పోర్టు నుంచి 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 2.35 గంటలకు పాయకరావుపేట వెళతారు. అక్కడ సూర్యమహల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల సభలో పాల్గొంటారు. సభ అనంతరం సాయంత్రం 4.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 5.20 గంటలకు రోడ్డుమార్గాన పాతగాజువాకకు 5.35 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం ఆరు నుంచి 7.30 గంటల వరకు ఎన్నికల సభలో పాల్గొంటారు. అనంతరం 7.40 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రాత్రి ఎనిమిది గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత తొలిసారిగా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర పర్యటనకు వస్తున్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, చోడవరం, గాజువాక సభలకు తొలుత ఏర్పాట్లుచేశారు. అయితే ఒకేరోజు మూడుచోట్ల సభలు నిర్వహణ సాధ్యం కాదని పాయకరావుపేట, గాజువాకలను ఖరారుచేశారు. అయితే ఈనెల 16వ తేదీన అనకాపల్లి జిల్లా చోడవరం, ఎలమంచిలిలో చంద్రబాబునాయుడుతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల సభల్లో పాల్గొననున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.

నిబంధనలు పక్కాగా అమలుచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత

పాడేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలుచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధి అరకులోయ మండలం, పాడేరు అసెంబ్లీ స్థానంలోని కొయ్యూరు మండలాల ప్రిసైడింగ్ అధికారులకు శనివారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, శిక్షణ లో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్ ల పనివిధానం, 17ఎ రిజిస్టర్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. అన్నీ తెలుసుననే భావన వదలి, ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా నేర్చుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణపై అందించిన పుస్తకాలను క్షుణ్ణంగా పదే పదే చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. మనమంతా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నామనే విషయం గుర్తుంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మే 13న ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ప్రారంభిస్తామనే విషయాన్ని పోలింగ్ ఏజెంట్‌లకు తెలియపరచాలన్నారు. పోలింగ్ సందర్భంగా నిర్లక్ష్యం, అలసత్వం ... మిగతా 8వ పేజీలో



ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత

కాఫీ పూతపై.. సూర్య ప్రతాపం!

తీవ్ర ఎండలకు మాడిపోతున్న వైనం

- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో గిరిజన రైతాంగం



మొగ్గ దశలోనే మాడిపోతున్న కాఫీ పూత

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 13:

ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడం, వేసవి ఆరంభం నుంచే భానుడి ప్రతాపం కాఫీ పూతపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈఏడాది మార్చి, ఏప్రిల్‌లో వర్షాలు కురవకపోవడం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పూత మొగ్గ దశలోనే మాడిపోతున్నది. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని గిరిజన రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

జిల్లాలో ఆదివాసీ రైతులు సంప్రదాయేతర వాణిజ్య పంటగా సుమారు 2.8లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు.ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో గిరిజన ప్రాంతంలో వర్షాలు కురుస్తాయి. ఇలాంటి వాతావరణమే కాఫీ సాగుకు అత్యంత అనుకూలమని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీంతో గత 45 ఏళ్లుగా గిరిజన ప్రాంతంలో కాఫీ సాగు విస్తరిస్తున్నది.ప్రస్తుతం గిరిజన ప్రాంత వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో మే, జూన్ నెలల్లో ఒకటి రెండు రోజులు మాత్రమే 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. మిగిలిన రోజుల్లో 35, 36 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. అయితే ఈఏడాది ఏప్రిల్ ప్రారంభంలోనే 37, 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం కాఫీ పంటకు నష్టం కలిగిస్తున్నది. సాధారణంగా మార్చిలో కురిసిన వర్షాలకు కాఫీ విస్తారంగా వస్తుంది. ఈఏడాది వర్షాలు లేక పూతరాలేదు. కొన్ని తోటల్లో పూత వచ్చినప్పటికీ ఎండ తీవ్రతకు మాడిపోయి రాలిపోతున్నది. గిరిజన ప్రాంత రైతులు కాఫీ పంటను వర్షాధార పంటగా సాగుచేస్తున్నారు. పూత దశలో వర్షాలు లేక దిగుబడులపై నిరాశచెందుతున్నారు.

వాతావరణంలో భారీ మార్పు..

గిరిజన ప్రాంత వాతావరణంలో భారీ మార్పు చోటు చేసుకుంటున్నాయి. ఏటా మార్చిలో సాధారణ వర్షపాతం 28 మి.మీ., ఏప్రిల్‌లో 76 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సివున్నది. గత ఏడాది మార్చిలో గరిష్ఠంగా 116 మి.మీ.. ఏప్రిల్‌లో 69 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈఏడాది మార్చిలో ఒక రోజు మాత్రమే చిరుజల్లులు కురవడంతో అత్యల్పంగా 3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఏప్రిల్ సగానికి వచ్చినప్పటికీ చినుకు జాడలేదు. గత పదేళ్లలో మార్చిలో వర్షాలు కురవపోవడం ఇదే ప్రథమమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వర్షం పడకుంటే పంట పోయినట్టే



రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే ఈఏడాది కాఫీ పంటను నష్టపోవాల్సివస్తుంది. కాఫీ పండ్లు సేకరణ ముగిసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క వర్షం కూడా పడలేదు. గిరిజన రైతులకు కాఫీ ప్రధాన ఆదాయ పంట. దిగుబడులు రాకపోతే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి.

- గుంజా బాలయ్య, వాడమామిడి.

మార్చి, ఏప్రిల్ వర్షాలు కీలకం



కాఫీ పంటకు మార్చి, ఏప్రిల్‌లో కురిసే వర్షాలే చాలా కీలకం. ఈ ఏడాది మార్చిలో వర్షాలు కురకవపోవడం వల్ల కాఫీ పూత ప్రారంభంకాలేదు. ఈనెలలో వర్షాలు కురిస్తే పంటకు ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాలు పడకపోతే కాఫీ దిగుబడులుపై తీవ్ర ప్రభావం పడుతుంది.

- డాక్టర్ శివకుమార్, సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం, చింతపల్లి.

మన్యంలో ఇటుకల పండగ సందడి



పజోర్లను వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 13: మన్యంలో ఇటుకల పండగ సందడి ప్రారంభమయింది. ఈ నేపథ్యంలో గిరిజన మహిళలు రహదారులపై పజోర్ల వసూలు చేస్తున్నారు. గిరిజన ఆచార, సంప్రదాయాల మేరకు గ్రామాల్లో ప్రధాన మార్గల్లో గేట్లు వేసి పజోర్లను వసూలు చేయడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఈ ఆచారాన్ని గిరిజనులు తప్పనిసరిగా అమలు చేస్తుంటారు. పజోర్ల ద్వారా వసూలు చేసిన డబ్బుతో మహిళలు పిండి వంటలు తయారుచేసి థింసా నృత్యాలను ఆస్వాదిస్తూ మూడు రోజులపాటు గిరిజన గ్రామాల్లో ఇటుకల పండుగను జరుపుకుంటారు.

ద్రోణి ప్రభావం... చల్లబడిన వాతావరణం

- పాడేరులో 38.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో మన్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వేసవి వేడి వాతావరణం కొనసాగింది. ఆతర్వాత ఆకాశం పూర్తిగా మేఘావృతమై కారుచీకటి కమ్ముకుంది. చిరు జల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. ముసురు వాతావరణాన్ని తలపిస్తూ ఆహ్లాదకరంగా మారింది. ఆకాశంలో మబ్బులు, మెరుపుల ప్రభావంతో భారీవర్షం కురుస్తుందని భావించినప్పటికీ, చిరు జల్లులు మాత్రమే పడ్డాయి.

పాడేరులో 38.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత....

ఏజెన్సీలో శనివారం ఉదయం నుంచి ఎండ ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గలేదు. పాడేరులో 38.8 డిగ్రీలు, అనంతగిరిలో 32.5, అరకులోయలో 35.0, చింతపల్లిలో 35.0, డుంబ్రిగుడలో 34.6, జీకేవీధిలో 32.4, జి.మాడుగులలో 34.2, హుకుంపేటలో 34.1, కొయ్యూరులో 37.7, ముంచంగిపుట్టులో 36.4, పెదబయలులో 33.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



బుధవారం మధ్యాహ్నం పాడేరు- చింతపల్లి మెయిన్‌రోడ్డులో చల్లబడిన వాతావరణం

గోదావరి డెల్టాకు నీటి విడుదల నిలిపివేత

- జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్

సీలేరు, ఏప్రిల్ 13 : డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు శనివారం సాయంత్రం నుంచి నీటి విడుదల నిలిపివేశామని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండింగ్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సీలేరు కాంప్లెక్సులో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు గోదావరి డెల్టాకు చేరుతుందని, అయితే పొల్లూరులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే 3,500 నుంచి 4 వేల క్యూసెక్కుల వరకు నీరు విడుదలవుతుందని, రబీలో మార్చి, ఏప్రిల్ నెలల్లో అధికంగా నీటి అవసం ఉన్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు ఏడేవేల క్యూసెక్కుల నీరు అవసరమని విన్నవించడంతో శనివారం సాయంత్రం వరకు డొంకరాయి జలాశయం ద్వారా నేరుగా (విద్యుత్ ఉత్పత్తి లేకుండా) 3,500 క్యూసెక్కుల నీటిని, విద్యుత్పత్తి ద్వారా మరో 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి లేకుండా ఇప్పటివరకు గోదావరి డెల్టాకు 4.248 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సులో 5 నుంచి 6 మిలియన్ యూనిట్ల వరకు విద్యుదుత్పత్తి జరుగుతోందని ఆయన వివరించారు.



డొంకరాయి జలాశయం వద్ద నీటి లెక్కలను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ శీధర్, తదితరులు

ప్రతిభ చూపారు

- గ్రూప్- 1 మెయిన్స్‌కు అర్హత సాధించిన గిరి యువకులు
- ఫలితమిచ్చిన ఐటీడీఏ ఉచిత సివిల్స్ కోచింగ్

పాడేరు, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): గ్రూప్- 1 ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన ఇద్దరు గిరి యువకులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఐటీడీఏ, 21 సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత సివిల్స్ కోచింగ్ పొందున్న సీదరి శ్రీను, గుజ్జెలి కమల్‌భార్గవ్ గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపి మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వీరిద్దరూ మెయిన్స్‌లోనూ సత్తా చాటుతారని ఐటీడీఏ పీవో అభిషేక్, కోచింగ్ నిర్వాహకులు ధరణి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఐటీడీఏ పూర్వ పీవో రోణంకి గోపాలక్రిష్ణ ఉచిత సివిల్స్ కోచింగ్ ప్రవేశపెట్టడంతో అనేకమంది గిరిజన యువతకు ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు అవకాశం కలుగుతోందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీదరి శ్రీను



గుజ్జలి కమల్‌భార్గవ్

మన్యంలో ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్

- వేసవిలో నిరంతర సరఫరాకు చర్యలు
- ఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

చింతపల్లి, ఏప్రిల్ 13: గిరిజన ప్రాంతంలో ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని ఏపీ ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) ఆపరేషన్స్ ఎల్.మహేంద్రనాథ్ అన్నారు. శనివారం చింతపల్లి, జీకే వీధి మండలంలోని శివారు పీవీటీజీ గ్రామాలైన పనసగొంది, మర్రిపాలెం, రాళ్లగెడ్డ సందర్శించారు. పీవీటీజీ, నాన్ పీవీటీజీ గృహాలకు అమర్చిన విద్యుత్ కనెక్షన్లను పరిశీలించి, వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. జన్‌మన్ పథకం ద్వారా ప్రతి పీవీటీజీ గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. గిరిజన ప్రాంతంలో ఏ ఇల్లూ విద్యుత్ మీటరు లేకుండా ఉండకూడదన్నదే ఈపీడీసీఎల్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా శివారు గ్రామాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ... మిగతా 8వ పేజీలో



రాళ్లగెడ్డ గ్రామంలో లబ్దిదారునితో మాట్లాడుతున్న ఎస్‌ఈ మహేంద్రనాథ్

అడుగంటిన జలాశయాలు

- తాగునీటికి ఇబ్బందులు

కొయ్యూరు, ఏప్రిల్ 13: వేసవి ఆరంభంలోనే నీటి నిల్వలు అడుగంటి రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌లు ఖాళీగా దర్శనమిస్తుండడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భూములు బీటలు బారి పశుగ్రాసం లభించక మూగజీవాలు బావురుమంటున్నాయి. ఎండల తీవ్రతకు మండలంలోని లుబుర్తి, నగరం, గింజర్తి తోకులగెడ్డ రిర్వాయర్లు ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. తాండవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాగా గుర్తించిన కొండవాగు ప్రవాహాలు, ఊటలు ఆధారంగా ప్రవహించే మల్లికార్జునస్వామి చెక్‌డ్యామ్, బూదరాళ్ళ, కాట్రగెడ్డ, చిట్టింపాడు చెక్‌డ్యామ్‌ల నుంచి నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో భూములు నెర్రలు బారియి. దీనికి తోడు కొండలపై అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పచ్చదనం కనుమరుగైంది. ఈ పరిస్థితుల్లో మూగజీవాలు అల్లాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకంలో తవ్వించిన చెరువులు, చెక్‌డ్యామ్‌ల్లో పూడిక తీయించేలా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా వేసవిలో పశు సంరక్షణకు గత ప్రభుత్వం నీటితొట్టిలు ఏర్పాటు చేసిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక పశు సంరక్షణను పట్టించుకోకపోవడంతో వాటిని కబేళాలకు అమ్ముకోవడం మినహా మరో మార్గం కనిపించడం లేదని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అడుగంటిన లుబ్బుర్తి జలాశయం

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

కశింకోట, ఏప్రిల్ 13: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి తుని రైల్వే పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ లోవరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బయ్యవరం-నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్ పక్కన శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి జారి పడి మృతి చెందాడు. ఈ ప్రమాదంలోసుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, ఇతను నిక్కరు ధరించి లేత నాచురంగు టీ షర్టు, నలుపురంగు ఛాయ గల మొహం, ఎడమ చేయిపైన రాము అని హిందీ అక్షరాలతో పచ్చబొట్టు కలిగి ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని ఇన్‌చార్జి ఎస్ఐ లోవరాజు తెలిపారు. మరిన్ని వివరాలకు 7674941459 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 13 : మండలంలోని చూచుకొండ వద్ద పేకాట స్థావరం పై శనివారం పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 87,660 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తొమ్మిది కిలోల గంజాయితో ఆరుగురు అరెస్టు

నర్సీపట్నం అర్బన్/ పాయకరావుపేట, ఏప్రిల్ 13 : మండలంలోని గబ్బాడ సమీపంలో ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. నెల్లిమెట్ట జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేపడుతుండగా, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తూ పట్టుపడ్డారన్నారు. అమలాపురం గ్రామానికి చెందిన పైల నాయుడు, కారు భాను, వేములపూడికి చెందిన అల్లు రమణ, పోలిపర్తి వెంకటరమణలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. అతడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదిలావుంటే, పాయకరావుపేట తాండవ షుగర్స్ చెక్‌పోస్టు వద్ద శనివారం ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేటలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం సీఐ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో నర్సీపట్నం- తుని ఆర్టీసీ బస్సులో ఉన్న ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోయేందుకు ప్రయత్నించగా వారి వెంబడించి పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న చేతి సంచిలో నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన బి.శ్యామలరావు, ఎ.సురేష్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కి తరలించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.

4,400 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

లంకెలపాలెం, ఏప్రిల్ 13: పెదముషిడివాడ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 4,400 కేజీల రేషన్ బియ్యాన్ని (పీడీఎస్ రైస్) శనివారం పరవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. లంకెలపాలెం నుంచి సబ్బవరం వైపు బొలెరో వాహనంలో 4,400 కేజీల రేషన్ బియ్యాన్ని పూసర్ల అచ్చిరాజు, మురుగుతి రాజు తీసు కువెళుతుండగా పెదముషిడివాడ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. వ్యాన్‌లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి, రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేశారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

38 మద్యం సీసాలు సీజ్


పట్టుబడిన మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఐ రామారావు

నాతవరం, ఏప్రిల్ 13 : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో శనివారం 38 మద్యం సీసాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. జిల్లేడిపూడికి చెందిన అల్లు రమణ, తాళ్ళపాలేనికి చెందిన ఈరే జోగరావులు అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద నుంచి సదరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే , నాతవరం పరిసర ప్రాంతాలలో సారా బట్టీలపై దాడి చేసి నాలుగు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.

తుమ్మపాల జంక్షన్‌లో...

అనకాపల్లి టౌన్: తుమ్మపాల జంక్షన్‌లో ఒక వ్యక్తి నుంచి 14 మద్యం బాటిళ్ల శనివారం స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. వెంకుపాలెం గ్రామానికి చెందిన ఎం.సురేష్ 14 మద్యం క్వార్టర్ బాటిళ్లను పట్టుకుని వెళ్తుండగా పట్టుకున్నామని, ఈమేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

1100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : మునిసిపాలిటీ పరిధిలోని సుబ్బారాయుడుపాలెంలో శనివారం దాడి చేసి పదకొండు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. సిబ్బందితో కలిసి ఈ దాడి చేసినట్టు చెప్పారు.

నేడు జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13: గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ జాతర వైభవోపేతంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఏడో రోజైన ఆదివారం మధ్యాహ్నం జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసులు రద్దు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 13: విశాఖ నుంచి సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసులను రద్దు చేస్తూ ప్రజా రవాణా శాఖ (పీటీడీ) విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులు శనివారం నుంచి మూడు రోజుల పాటు మన్యం బంద్ ప్రకటించడం వల్ల అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. విశాఖ నుంచి సీలేరుకు ఒకటి, భద్రాచలానికి రెండు నైటు సర్వీసులు ఉన్నాయి. ఈ మూడింటిని రద్దు చేశారు. పగటి వేళలో భద్రాచలం వెళ్లాల్సిన సర్వీసుల రూటు మార్చారు. విశాఖ నుంచి నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, మోతుగూడెం మీదుగా భద్రాచలం రాకపోకలు సాగించే సర్వీసులను విశాఖ, రాజమండ్రి, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా భద్రాచలానికి నడుపుతున్నారు. పగలు నడిచే ఆరు సర్వీసులు కూడా మూడు రోజుల పాటు ఇదే రూట్‌లో ఆపరేట్ చేస్తామని ద్వారకా బస్‌స్టేషన్ మేనేజర్ అమర సింహుడు తెలిపారు. ఈ రెండు రూట్లలోని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

విశాఖ.. భవానీపట్న పాసింజర్ రైళ్లు రాయగడ వరకే..

విశాఖపట్నం, ఏప్రిల్ 13: సంబల్‌పూర్ డివిజన్‌లో భద్రత సంబంధిత పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలిక రద్దు చేసిన విశాఖ, భవానీపట్న-విశాఖ పాసింజర్ రైళ్ల సర్వీసులను (08504/08503) ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 15 నుంచి పునఃప్రారంభించి గమ్యాలను కుదించి నడపనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. దీంతో 08504 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు విశాఖ నుంచి రాయగడ వరకు, తిరుగు ప్రయాణంలో 08503 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి 25 వరకు రాయగడ నుంచి విశాఖకు రానుంది. రాయగడ, భవానీపట్న మధ్య రాకపోకలు తాత్కాలికంగా ఉండవని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఇరవై గ్రామాల ప్రజలకు ఇక్కట్లు!

తొమ్మిది నెలలుగా సా... గుతున్న ఆర్ఈసీ రోడ్డు పనులు


తవ్వేసిన కేబీ రోడ్డు టూ ఆర్ఈసీ రోడ్డు

- పెదమదీనా- గున్నెంపూడి మధ్య తేలిన రాళ్లు
- రాకపోకలకు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 13 : మండలంలోని రావికమతం, ఈశ్వరవానిపాలెం, చోడవరం (ఆర్ఈసీ) రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రాకపోకలకు రెండు మండలాలకు చెందిన ఇరవై గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హడావుడిగా ఈ పనులు చేపట్టడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అన్నచందాన మారిందని అంటున్నారు. ఆగస్టులో ప్రారంభించిన ఆర్ఈసీ రోడ్డు నిర్మాణ పనులు రెండు పర్యాయాలు నిలిచిపోవడంపై ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల తీరును అంతా దుమ్మెత్తి పోస్తున్నారు. కశింకోట- బంగారుమెట్ట (కేబీ) రోడ్డు నుంచి వయా పెదమదీనా, గున్నెంపడి, ఆర్ఈసీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీనిని అభివృద్ధి చేయాలని గత నాలుగేళ్లుగా ప్రజలు చేసిన


పెదమదీనా వద్ద పైకి తేలిన వెట్‌మిక్స్ మెటల్

విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు రూ.1.83 కోట్ల నిధులు మంజూరు చేశారు. గత ఏడాది ఆగస్టు 18వ తేదీన చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ప్రారంభంలో కొన్నాళ్ల పాటు పనులు చురుగ్గా జరగడంతో నిర్ణీత సమయంలో రోడ్డు పనులు పూర్తి కాగలవని బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన ప్రజలు ఆశించారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా కేబీ రోడ్డు నుంచి పెదమదీనా, గున్నెంపూడి హైస్కూల్ వరకు ఉన్న రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో పెకిలించారు. రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న మట్టి బెర్మ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేసిన సదరు కాంట్రాక్టర్ ఆకస్మాత్తుగా పనులను మూడు నెలల కాలం నిలిపివేశారు. దీంతో రోడ్డును పెకలించడం వలన తేలిన రాళ్లపై ప్రయాణం నరక ప్రాయంగా మారిందని రెండు మండలాలకు చెందిన ప్రజలు ఆందోళనలు చేపట్టారు. దీనిపై దిగివచ్చిన అధికారులు నవంబరు నెలలో కేబీ రోడ్డు నుంచి పెదమదీనా వరకు వెట్‌మిక్స్ వేసి, మళ్లీ పనులను అర్ధాంతరంగా నిలిపివేసి మూడు నెలలు కావస్తుంది. పెదమదీనా నుంచి గున్నెంపూడి వరకు వెట్‌మిక్స్ వేయకపోవడంతో రాళ్లు తేలిపోయాయి. అలాగే కేబీ రోడ్డు నుంచి పెదదీనా వరకు వేసిన వెట్‌మిక్స్‌లో మెటల్ కూడి లేచిపోయింది. దీంతో ఆర్ఈసీ రోడ్డుపై ప్రయాణాలు మరింత కష్టంగా మారిందని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం ప్రారంభమైన ఈ పనులు తరుచూ నిలిపివేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తేలిపోయిన రాళ్లపై నుంచి ప్రయాణాలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇటు వంటి రోడ్డుపై రాకపోకలు చేస్తుండడం వల్ల వాహనాలు పాడవుతున్నాయని ఆయా యజమానులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కేబీ రోడ్డు నుంచి ఆర్ఈసీ రోడ్డు వయా పెదమదీన, గున్నెంపూడి రోడ్డును సత్వరమే పూర్తి చేయాలని అంతా కోరుతున్నారు.

అర్లలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- లోసింగిలో గిరిజనులు వినూత్న రీతిలో ఆందోళన
- 13 కి.మీ. దూరం వెళ్లి ఓటు వేయడం కష్టమని ఆవేదన


లోసింగిలో డోలీతో ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

రోలుగుంట, ఏప్రిల్ 13: కొత్త పంచాయతీ అర్ల గ్రామంలోనే తాము ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని లోసింగిలో గిరిజనులు శనివారం డోలీతో ఆందోళన చేపట్టారు. అర్ల పంచాయతీ పరిధిలోని కొండ శిఖర గ్రామాలైన పిత్రిగెడ్డ, నీలబంద, పెదగవురు, గదబపాలెం, పాత లోసింగి తదితర గిరిజన గ్రామాలు పాత పంచాయతీ శరభవరంలో ఉండేవని, 2019 ఎన్నికల్లో పదిహేను కిలోమీటర్లు దూరం నడుచుకుని అక్కడికి వెళ్లి ఓట్లు వేశామన్నారు. కొత్తగా 2020లో అర్ల గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలు కూడా ఇక్కడే జరిగాయన్నారు. ప్రస్తుత ఓట్లు పాత పంచాయతీ కేంద్రంలోనే ఉన్నాయని, దీనివలన 15 కిలోమీటర్లు దూరం వెళ్లి వేయాల్సి వస్తుందని వాపోయారు. ఈ కారణంగా పలువురు ఓట్లు వేసేందుకు దూరమవుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నూతన పంచాయతీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు ఉన్నందున అర్ల గ్రామంలోనే తమకు ఓటు వేసే అవకాశాన్ని కల్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాంగి శాంతి, కిల్కో రుక్మ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సాధారణ ఓపీకి ఆధార్ తప్పనిసరి

- ప్రతి రోగికి హెల్త్ ఐడీ నెంబరు
- ఓపీ రాయించుకునేవారు ఆధార్ జెరాక్స్ ఇవ్వాలి
- రోగి పేరు మీద ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు


ఏరియా ఆస్పత్రిలో ఓపీ రాయించుకుంటున్న రోగులు

నర్సీపట్నం, ఏప్రిల్ 13 : నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలోని జనరల్ ఓపీ విభాగానికి వచ్చే రోగులు తప్పని సరిగా ఆధార్ జెరాక్స్ తెచ్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ రోగులకు మాత్రమే ఆధార్ అవసరమయ్యేది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి హెల్త్ ఐడీ ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో జనరల్ ఓపీకి వచ్చే రోగులు ఆధార్ జెరాక్స్ అందజేసి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. గత ఏడాది మే నెల నుంచే ఈ ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు వచ్చినప్పటికీ రోగులు ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ఆధార్ అడగడం లేదు. ఇప్పుడు ఉన్నతాధికారులు జనరల్ ఓపీకి ఆధార్ తప్పనిసరి చేశారు. ఏరియా ఆస్పత్రికి వెళ్లే రోగులు తప్పని సరిగా ఆధార్ జెరాక్స్ కూడా పట్టుకొని వెళ్లాలి. ఆధార్‌తో రోగి పేరును హెల్త్ రిజిస్ట్రేషన్ చేసి హెల్త్ ఐడీ ఇస్తారు. రోగిని పరీక్షించే డాక్టరు పేరు, రక్త పరీక్షలు, మందుల వివరాలు అందులో నమోదు చేస్తారు. దీనినే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు అంటారు. ఫిబ్రవరి, మార్చి నెలలో సుమారు రెండు వేల మందికి హెల్త్ ఐడీలు ఇచ్చినట్టు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి తెలిపారు. హెల్త్ ఐడీ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కదానికి రూ.40 చొప్పున ప్రోత్సాహక నగుదు ఇస్తుంది. పేషెంట్ కూడా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు (ఈహెచ్ఆర్) వలన చాలా ఉపయోగాలు ఉన్నాయి. రోగి ఇతర ఆస్పత్రులకు వెళ్లినప్పుడు హెల్త్ ఐడీ ఉంటే సులభతరం అవుతుంది. ఏ డాక్టర్ తనిఖీ చేశారు ? ఏ పరీక్షలు చేశారు ? ఏ మందులు వాడారన్నది తెలుస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రి సేవలు పారదర్శకంగా జరుగుతాయి.

పట్టపగలు కిడ్నాప్

- పోలీసులు ఉరుకులు పరుగులు
- గంటల వ్యవధిలో కిడ్నాపైన వ్యక్తి గుర్తింపు
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం?

ఎం.వి.పి.కాలనీ, ఏప్రిల్ 13: నగరంలో రద్దీగా ఉండే బీచ్‌రోడ్డులో శనివారం మధ్యాహ్నం అందరూ చూస్తుండగా కిడ్నాప్ జరగడం కలకలం సృష్టించింది. కామత్ హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై వాచీలు విక్రయిస్తుంటారు. అక్కడ సిల్వర్ కలర్ ఇండికా కారులో నుంచి ఓ వ్యక్తి దిగి వాచీలు చూస్తున్నారు. ఈలోగా ఆ కారు వెనుకే మరో కారు(స్విఫ్ట్ డిజైర్)లో వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు...వాచీలు చూస్తున్న వ్యక్తిని బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకుపోయారు. వాచీలు అమ్మే వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. కిడ్నాప్ అయిన వ్యక్తి ఎక్కిన కారు డ్రైవర్ ఎం.వి.పి. స్టేషన్‌కు వెళ్లి కారులో ఉండిపోయిన ల్యాప్‌టాప్, సెల్ ఫోన్‌ను అప్పగించాడు. రుషికొండ రాడిసన్ బ్లూ వద్దకు వెళ్లడానికి సంపత్ వినాయక ఆలయం వద్ద కారు ఎక్కినట్టు డ్రైవర్ పేర్కొన్నాడు. దీంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఎట్టకేలకు సదరు వ్యక్తిని పోలీసులు పట్టుకోగలిగినా, ముందు కిడ్నాప్, బంగారం దోచుకున్నారు అని చెప్పిన వ్యక్తి...ఆ తర్వాత అబ్బే అలాంటిదేమీ లేదన్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం...శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన వ్యక్తికి విశాఖలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆమెను కలవడానికి శనివారం విశాఖ వచ్చాడు. మహిళ తాలూకా మనుషులు ఈ విషయం తెలుసుకుని, సంపత్ వినాయక్ ఆలయం నుంచి అతడిని వెంబడించారు. బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్ వద్ద ఆగి వాచీలు చూస్తుండగా కిడ్నాప్ చేసి, అప్పుఘర్ వైపు తీసుకుపోయారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాచీలు అమ్ముకునే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు.

రంగంలోకి దిగిన పోలీసులు కిడ్నాప్ కాబడిన వ్యక్తిని, నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ముందు తనను కిడ్నాప్ చేశారని, తన వద్ద ఉన్న బంగారం దోచుకున్నారని చెప్పిన వ్యక్తి, ఆ తర్వాత ప్లేటు మార్చాడు. అతడి వద్ద ఉన్న బంగారం సైతం రోల్డుగోల్డేనని పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం బయట పడుతుందనే కారణంతో ఫిర్యాదు చేసేందుకు వెనుకాడినట్టు తెలిసింది. దీంతో ఏం చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకున్నారు. అయితే ఈ విషయం సంచలనంగా మారడంతో మహిళ భర్తతో పాటు మరో నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు ఎం.వి.పి.కాలనీ ఎస్.ఐ.శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలావుండగా ఆరిలోవ స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణాపురం వద్ద జరిగిన ఓ యువకుడి హత్య చేసిన కేసులో సైతం వివాహేతర సంబంధం కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు తెలిసింది.

కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో నీటి సమస్య

- మోటార్‌కు అందని విద్యుత్ సరఫరా
- పర్యాటకులకు ఇబ్బందులు
- ఎండలకు ఎండుతున్న మొక్కలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 13 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కులో మొక్కలు ఎండకు ఎండుతున్నాయి. వారం రోజుల క్రితం ఇక్కడి మోటర్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే త్రీఫేజ్ వైర్లు పాడవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనిపై సదరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో పార్కులో అందమైన మొక్కలు నీరు లేక ఎండిపోతుండగా, ఇక్కడికి వచ్చే పర్యాటకులు సైతం తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్నాళ్ల పాటు ఇదే పరిస్థితి ఉంటే పార్కులో పచ్చదనం పాడై కళావిహీనంగా మారే ప్రమాదం ఉందని పర్యాటకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఇక్కడి సమస్యపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.


నీరులేక పార్కులో ఎండుతున్న మొక్కలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు

- జిల్లా ఎస్పీ కేవీ కృష్ణమూర్తి హెచ్చరిక
- పాయకరావుపేట పోలీస్ చెక్‌పోస్టు తనిఖీ


పాయకరావుపేట చెక్‌పోస్టు వద్ద సీఐకి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పాయకరావుపేట, ఏప్రిల్ 13: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలో తాండవ షుగర్స్ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీచేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ తదితర అంశాలపై సీఐ పి.అప్పలరాజుతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను మభ్యపెట్టేందుకు డబ్బు, మద్యం, ఉచిత కానుకలు తరలించే అవకాశం ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ నాతవరం మండలం గన్నవరం మెట్టు పోలీస్ చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు తదితరులున్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

- డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్


పాయకరావుపేటలో సమావేశమైన డీబీపీ రాష్ట్ర నాయకులు

పాయకరావుపేట, ఏప్రిల్ 13: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటించారు. శనివారం స్థానిక డీబీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర నాయకుల సమావేశంలో కృష్ణస్వరూప్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మాఫియా దోపిడీ పార్టీలను ఓడించాలన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో డీబీపీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీబీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బి.రమేశ్, రాయపాటి శామ్యూల్, జాన్ ధర్మరాజు, దువ్వాడ దావీదు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు

- చింతపల్లి ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారుల ప్రయత్నాలు
- రాత్రి వేళ ఊటగెడ్డ నుంచి బావిలోకి నీరు డంప్
- మరుసటి రోజు శుద్ధి చేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా
- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం


ఊట గెడ్డను నీటిని పరిశీలిస్తున్న అధికారులు

చింతపల్లి, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభించారు. ప్రజలకు పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. రాత్రి వేళ ఊట గెడ్డ నుంచి బావిలోకి నీటిని డంప్ చేసి, అనంతరం శుద్ధి చేసి ట్యాంకర్ల ద్వారా అందిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మండల కేంద్రం ప్రజలకు నీటి సరఫరా చేస్తున్న సీపీడబ్ల్యూ పథకం ట్యాంకులకు నీళ్లు నింపే బావులు అడిగంటిపోయాయి. దీంతో నెల రోజులుగా కొళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యలను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. ఈ కథనాలకు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పందించి చింతపల్లి ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. అయితే ట్యాంకర్లు నింపేందుకు సైతం బావుల్లో నీరు లేకపోవడంతో ప్రజలందరికీ పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలపై ప్రత్యేక దృష్టిసారించారు.

పెదపైపు నుంచి నీటి సరఫరా..

చింతపల్లి ప్రజలకు సుదీర్ఘకాలం దాహార్తి తీర్చుతున్న పెదపైపు(ఊటగెడ్డ) నుంచి పలు వీధులకు నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. పెదపైపు చింతపల్లి ప్రజలకు జీవధార అని చెప్పకతప్పదు. పెదపైపు వద్ద ప్రతి కాలంలోనూ నీరు వస్తుంది. మెజారిటీ ప్రజలు ఈపెదపైపు నుంచే నీళ్లనే ఉపయోగించుకుంటున్నారు. పెదపైపు నీళ్లను వినియోగించుకుని ప్రజలకు నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీడీవో వీర సాయిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జీఆర్‌హెచ్.రాజు, ఏఈఈ గడుతూరి స్వర్ణలత, కార్యదర్శి శ్రీనివాసరావు పెదపైపును సందర్శించారు. పటగటి పూట పెదపైపు నీళ్లను స్థానిక ప్రజలు పట్టుకునేలా, రాత్రివేళ పెదపైపు నీళ్లను సమీపంలోని బావిలో డంప్ చేయాలని అధికారులు నిర్ణయించారు. బావిలో డంప్ చేసిన నీటిని మరుసటి రోజు ఉదయం శుద్ధి చేసి ట్యాంకర్ల ద్వారా పలు వీధుల ప్రజలకు నీటి సరఫరా చేయాలని భావించారు. ఈ మేరకు పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు పెద పైపు నీటిని బావిలోకి డంప్ చేసేందుకు కార్యాచరణ ప్రారంభించారు. మరో రెండు రోజుల్లో పెదపైపు నీరు మండల కేంద్రం ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం


జి.మాడుగులలో కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

జి.మాడుగుల, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు స్పష్టం చేశారు. మన్యంలోని పలు మండలాల్లో శనివారం టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. జి.మాడుగుల మండలంలోని వంతల, సొలభం, గడుతూరు పంచాయతీ గ్రామాల్లో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని వివరించారు. రానున్న కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి పిన్నయ్యదొర, జనసేన మండల అధ్యక్షుడు భీమన్న, బీజేపీ మండల అధ్యక్షుడు బొయిని నూకరాజు, నాయకులు కె.కల్యాణం, ఎస్.నాగబ్బాయి, ఎల్.బాలయ్యదొర, ఎం.మత్స్యరాజు, బి.బాబూరావు, ఎస్.చిరంజీవి, త్రిమూర్తులు, వి.పోతురాజు, వి.సుబ్బారావు, ఎస్.వెంకటరమణ, టి.రమేశ్, నాయుడు బుజ్జిబాబు విక్కి, రాజు తదితరులు పాల్గొన్నారు.

- టీడీపీ-బీజేపీ-జనసేన నాయకుల స్పష్టం

కూటమి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు పనిచేయాలి

చింతపల్లి: కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు పని చేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాన్ని కాపాడుకోలేమన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో ఆదివాసీలకు తీరని నష్టం జరిగిందన్నారు. ఐదేళ్ల పాలనలో ఆదివాసీలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. గిరిజనుల జీవితాలు బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి రమేశ్‌నాయుడు విజయానికి కృషి చేయాలన్నారు. వైసీపీ మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. టీడీపీ నాయకులు పార్టీకి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, జనసేన మండలాధ్యక్షుడు కోయం బాలరాజు, నాయకులు గంగాధర్, సునీల్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి గెలుపు అవసరం

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి గెలుపు ఎంతో అవసరమని టీడీపీ డివిజన్ నాయకుడు పి.పాండురంగస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ జనసేన ఉమ్మడి నేతల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పనిచేసి ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అతను ముఖ్యమంత్రి అయితేనే గిరిజన ప్రాంతం అభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని, ప్రతీ ఒక్కరూ కూటమి విజయానికి తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజషన్ సెక్రటరీ అడికటియ తిరుపతి రావు, మండల ప్రధార కార్యదర్శి కె.జగత్రాయ్, మాజీ సర్పంచ్ కూడ వెంకటరావు, బీజేపీ మండల అధ్యక్షుడు వి.లక్ష్మణ్, కూటమి నాయకులు బాబూజీ, మత్స్యరాజు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మురారి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టు సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగస్వామి

ఎన్డీఏ కూటమి కార్యాలయం ప్రారంభం

పెదబయలు: మండల కేంద్రంలోని మోదకొండమ్మ దేవాలయం పక్కన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువుర నాయకులు మాట్లాడారు. కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజార్టీతో గెలిపించి చట్ట సభలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు పాండురంగస్వామి, పాంగి రామయ్య, ప్రశాంత్‌కుమార్, రామారావు, బాబూరావు, లైకోన్, తిరుపలిరావు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షా పత్రాల మూల్యాంకనం పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజిరావు

సజావుగా ఓపెన్ టెన్త్ మూల్యాంకనం

పాడేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో సార్వత్రిక పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం సజావుగా ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 22,125 జవాబు పత్రాలు, 26 గ్రూపులు, 226 మంది సిబ్బందితో 11 గదుల్లో మూల్యాంకనం మొదలుపెట్టినట్టు చెప్పారు. ఈ ప్రక్రియ జరుగుతున్న తీరును డీఈవో బ్రహ్మాజిరావు, విద్యా శాఖ సహాయ సంచాలకుడు వినయ్‌మోహన్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శశికుమార్ పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

అరకు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు



అరకులోయ, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నింటా వెనుకబాటుకు గురైందని, అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు ఆరోపించారు. అనంతగిరి మండలంలోని కివర్ల, పినకోట, పెదకోట పంచాయతీల పరిధిలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఏపీలో చంద్రబాబు, కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి రావాలని చెప్పారు. మూడు పార్టీ పొత్తులో భాగంగా అరకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్‌లను బీజేపీ కేటాయించినప్పటికీ, మూడు పార్టీల నేతలు విజయమే లక్ష్యంగా కష్టపడి ప్రచారం ముమ్మరం చేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కొత్తపల్లి గీతను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుజ్జిబాబు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు రా(లే)క రైతుల 'చింత'


కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న చింతపండుం రైతులు

హుకుంపేట, ఏప్రిల్ 13: మండలం కేంద్రమైన హుకుంపేట వారపు సంత ఈ వారం రైతులను నిరాశపరిచింది. శనివారం జరిగిన సంతలో వ్యాపారుల కోసం రైతులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఎంతకీ వ్యాపారులు రా(లే)క చింతపండు రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఈ వారం వారపు సంతకు రైతులు భారీగా చింతపండును తీసుకువచ్చారు. అయితే సరకును కొనుగోలు చేసే వ్యాపారులు లేకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పలేదు. దీంతో ధర ఒక్కసారిగా పడిపోయింది. గత వారం గంప చింతపండు రూ.800 నుంచి రూ.900 ధర పలకగా, ఈ వారం ఒక్కసారిగా రూ.500కి పడిపోయింది. గత్యంతరం లేక దళారులను బతిమాలుకుని సరకు అమ్ముకోవాల్సి వచ్చిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా జీసీసీ కిలో చింతపండు రూ.33కు కొనుగోలు చేయడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీసీసీ ద్వారా గిట్టుబాటు ధరతో చింతపండును కొనుగోలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి సీలేరు మారెమ్మ ఉత్సవాలు

- 16న అమ్మవారి గరగ అలంకరణ, అగ్నిగుండం
- 27న అమ్మవారి ప్రతిమ ఊరేగింపు 28న ప్రధాన పండుగ


ఉత్సవాలకు ముస్తాబైన సీలేరు మారెమ్మ అమ్మవారి ఆలయం

సీలేరు, ఏప్రిల్ 13: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు గ్రామ దేవత మారెమ్మ 52వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభకానున్నాయి. అమ్మవారిని ఒక్క సీలేరు ప్రాంత ప్రజలే కాకుండా ఒడిశా, తెలంగాణ, ఆంధ్రాలోని పలు ప్రాంతాల భక్తులు కూడా కొలుస్తుంటారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలు తమిళ సంవత్సరాదిన పతాకావిష్కరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఉత్సవాల్లో ఎంతో ముఖ్యమైనది గరగ అలంకరణ, గరగ అగ్నిగుండం వీదుగా ఆలయ ప్రవేశం కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. మారెమ్మ మహిమ గల అమ్మవారుగా నిరూపించడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని భక్తుల విశ్వాసం. సుమారు 60 నుంచి 70 మంది భక్తులు అమ్మవారి ఆలయ ఎదుట ఏర్పాటుచేసిన అగ్నిగుండం తొక్కుతారు. అగ్నిగుండం తొక్కిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ నెల 16న గరగ అలంకరణ, అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి మహిమను వీక్షిస్తారు. ఉత్సవాల్లో ఈ నెల 27న అమ్మవారి ప్రతిమను పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగిస్తారు. 28న అమ్మవారి ప్రధాన పండుగను నిర్వహిస్తారు. అదే రోజు భక్తులు అమ్మవారి మొక్కులను తీర్చుకుంటారు. వచ్చే నెల 1వ తేదీ అమ్మవారి మరుపూజ కార్యక్రమంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

సీతారాముల కల్యాణ మహోత్సవాలకు పందిరి రాట

పాడేరు రూరల్, ఏప్రిల్ 13: కిండంగి పంచాయతీ కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శనివారం పందిరం రాట వేశారు. ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, విజయరాణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా నాగరాజు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ ప్రతినిధులు, కిండంగి, నక్కులపుట్టు, సేరుబయలు తదితర గ్రామాల మహిళలు పాల్గొన్నారు.


పాడేరు మండలం కిండంగి గ్రామంలో పందిర రాట వేస్తున్న భక్తులు


సీలేరు రామాలయం వద్ద ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

సీలేరులో...

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాల శనివారం ముహూర్తపు రాట వేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం రాట వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు , ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి తదితర్లు పాల్గొన్నారు.

మన్యంలో ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్

... 5వ పేజీ తరువాయి

ఇస్తున్నామన్నారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 2,123 పీవిటీజీ, 250 నాన్ పీవిటీజీ గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చామన్నారు. మీటర్, మెయిన్ బోర్డు, సర్వీసువైర్‌తోపాటూ ఉచితంగా కనెక్షన్ ఇస్తున్నామన్నారు. ఇందుకోసం 300 స్తంభాలు, 14 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని గృహాలను గుర్తించి కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంత వినియోగదారులు జన్‌మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవిలో నిరంతర సరఫరా..

వేసవిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాడేరు, అరకు, కొయ్యూరు, చింతపల్లి పరిధి విద్యుత్ లైన్‌లో నిర్వహణ పనులు, మరమ్మతులు పూర్తిచేశామన్నారు. 33/11కేవీ విద్యుత్ లైన్లకు దగ్గరగానున్న జంగిల్ తొలగించామన్నారు. సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వేసవిలో వినియోగదారులకు నిరంతవిద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఎస్ఈ వెంట ఏడీ సూర్య ప్రతాప్, ఏఈఈ ప్రభాకరరావు, ఎల్ఐ గంగరాజు పాల్గొన్నారు.

నిబంధనలు పక్కాగా అమలుచేయాలి

... 5వ పేజీ తరువాయి

పనికిరాదని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓటరు చెక్ లిస్టు, పీవో డైరీ సక్రమంగా నిర్వహించాలని, అవసరం మేరకు సెక్టార్ అధికారుల వద్ద రెండు ఈవీఎంలు రిజర్వులో ఉంచుతామని, ఎక్కడైనీ ఈవీఎంలు పనిచేయకపోతే వెంటనే మార్చాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

అనంతగిరి ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

రోడ్డుకు అడ్డంగా నిలిచిన కర్రల లోడ్ లారీ.. స్తంభించిన వాహన రాకపోకలు



రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన కర్రల లోడ్ లారీ... స్తంభించిన వాహనాలు

అరకులోయ, ఏప్రిల్ 13: అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారికి అడ్డంగా కర్రల లోడ్ లారీ నిలిచిపోవడంతో ఇరువైపులా వాహనాలు స్తంభించిపోయాయి. అరకులోయ నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్తున్న కర్రల లోడు లారీ టైడా-శివలింగపురం మధ్య మధ్యలోని మూడో నంబర్ మలుపు వద్ద రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. దీంతో రహదారికి రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలియగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించారు. సుమారు రెండు గంటల రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీని మరమ్మతు చేయించి తొలగించడంతో వాహన చోదకులు ఊపిరి తీసుకున్నారు.

సంక్షిప్తంగా..

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఇద్దరు వైసీపీ నాయకులపై కేసు

జి.మాడుగుల, ఏప్రిల్ 13: మండలంలోని కోరాపల్లి సచివాలయ కార్యాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడి సమావేశం నిర్వహించిన ఇద్దరి వైసీపీ నాయకులపై కేసు నమోదైందని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. గత బుధవారం 11న కోరాపల్లి పంచాయతీ సచివాయంలో స్థానిక వైసీపీ నాయకులు రాజకీయ సమావేశం నిర్వహించనట్టు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టిన అధికార యంత్రంగం స్థానిక వైసీపీ నాయకుడు బాలన్న, సూర్యనారాయణ ఇద్దరిపై కేసులు నమోదైనట్టు ఎంపీడీవో చెప్పారు.

యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి : సీఐ

కొయ్యూరు, ఏప్రిల్ 13: గిరిజన యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కొయ్యూరు సీఐ వెంకటరమణ సూచించారు. మండలంలోని నడింపాలెం గ్రామంలో శనివారం గిరిజన యువకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాని కోరారు. ఉన్నత విద్యనభ్యసించి భవిష్యత్ చక్కగా తీర్చిదిద్దుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు దిగి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో ఓటుకు అభ్యర్థులు ఇచ్చే డబ్బు, మద్యానికి ఆశపడవద్దని సూచించారు. ప్రధానంగా గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు మహిళలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చింతపల్లి, ఏప్రిల్ 13: మండలంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం చింతపల్లిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడంతో పోలీసులు పలు చోట్ల తనిఖీలను విస్తృతం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచి పెడుతున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అలాగే మావోయిస్టులు బంద్‌కి పిలుపునివ్వడంతో ఓవైపు పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

'గిరిజన చట్టాలను తుంగలో తొక్కిన వైసీపీ ప్రభుత్వం'

చింతపల్లి, ఏప్రిల్ 13: గిరిజన చట్టాలు, హక్కులను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని సీపీఎం నాయుడు పాంగి ధనుంజయ్ విమర్శించారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ బొర్రమామిడి, మల్లుమెట్ట గ్రామాల్లో సీపీఎం నాయకులు, గిరిజనులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పీవీటీజీలకు చెందిన ప్రత్యేక రాయితీలను రద్దు చేసిందన్నారు. ఆదివాసీలు తమ గ్రామాలు ముంపునకు గురవుతాయని, యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలను రద్దుచేయాలని నిరసనలు, ఆందోళనలు చేపట్టినప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు. గిరిజనుల సమస్యలపై నిత్యం పోరాడే సీపీఎం అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు సాగిన చిరంజీవి పడాల్, డిప్పలరాజుబాబు, పాపారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యూరు, ఏప్రిల్ 13: మండలంలోని చింతవానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దశాబ్ద కాలంగా ఉపాధ్యాయులుగా పనిచేసిన కేతవరపు రాము, వరలక్ష్మీ దంపతులు సుమారు రూ.2 లక్షలు వెచ్చించి నూతన విగ్రహాలు బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిబోయిన చక్రధరరావు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించి ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లకీ ఊరేగింపు, భజనలు, కోలాటాలు నిర్వహించారు. అనంతరం రామాలయ ఆవరణలో శనివారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

16 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. నాలుగు రోజులు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని ఆయన కోరారు.